# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

- ప్రతి గడపకూ చేరిన సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని ఆశీర్వదించండి
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు




అలంపూరులో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

అయిజ, నవంబర్ 23 : బీఆర్ఎస్ సర్కారుతోనే సంక్షేమాభివృద్ధి జరుగుతుందని బీఆర్ఎస్ శ్రేణులు వివరిస్తున్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతిగడపకూ అందాయన్నారు. బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో ఇతర పార్టీలకు ధీటుగా ఉన్నాయన్నారు. కేసీఆర్ భరోసాతో ప్రజలకు ఎంతోమేలవుతుందన్నారు. అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తే పట్టణం మరింత అభివృద్ధి అవుతుందన్నారు. ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చలువతో అయిజ మున్సిపాలిటీ అభివృద్ధిపథంలో పయనిస్తున్నదన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహులు, కౌన్సిలర్లు సువర్ణ మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఉండవెల్లిలో...

ఉండవెల్లి, నవంబర్ 23 : మండలంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు గెలుపునకు ఎంపీటీసీలు రాజశేఖర్, సుంకన్న ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి బీఆర్ఎస్ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రం సాధిస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు ఓటు వేసి ఇతరులతో వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.



వావిలాలలో ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

### వావిలాలలో ప్రచారం

ఇటిక్యాల, నవంబర్ 23 : మండలంలోని వావిలాల గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రగౌడ్, శివశంకర్‌రెడ్డి, మౌలాలి బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడి గెలుపునకు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. అలాగే అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కలిసికట్టుగా బీఆర్ఎస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకొందామని తెలిపారు.

### రాజోళిలో..

రాజోళి, నవంబర్ 23 : తెలంగాణలో ప్రజలకు అండగా ఉంటూ అనేక సంక్షేమ పథకాలను అందించిన సర్కార్ గెలవాలంటే కారు గుర్తుకు ఓటు వేయాలంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు ఎన్నిక ప్రచారం నిర్వహిస్తున్నారు. గురువారం మండల కేంద్రంలో సర్పంచ్ వెంకటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి అలంపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని గెలిపించాలని ప్రజలను కోరారు. బీఆర్ఎస్‌తోనే గ్రామాలకు అభివృద్ధి జరుగుతుందని కేసీఆర్ ప్రత్యేక నిధులతో నేడు గ్రామాల మహర్దశ మారాయని మళ్లీ సార్ కావాలంటే కారుగుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్సీ చల్లా మద్దతుదారుడు విజయుడిని భారీ మెజారిటీ అందించాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రాజోళిలో పాల్గొన్న ఉపసర్పంచ్ గోపాల్

### ఊట్కూరులో ప్రచారం..

అలంపూర్, నవంబర్ 23 : బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడి గెలుపు కోసం మండలంలోని ఊట్కూరు గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ సర్పంచులు ఎద్దుల శ్రీనివాసరెడ్డి,ఎద్దుల లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచు మద్దెల అయ్యస్వామి తదితరుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నమూనా పత్రాలు చూపిస్తూ, కారు గుర్తుపై ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ మానిఫెస్టో ఓటర్లకు వివరించారు. ప్రచారంలో మహిళలు భారీగా పాల్గొన్నారు.



ఉండవెల్లిలో ప్రచారంలో పాల్గొన్న ఎంపీటీసీలు



అయిజలో ప్రచారంలో కౌన్సిలర్ సువర్ణ

## కాళికాదేవి శిలావిగ్రహం ఊరేగింపు



కాళికాదేవి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అయిజ, నవంబర్ 23 : పట్టణంలోని కాళికాదేవీ ఆలయంలో ప్రతిష్ఠించనున్న కాళికాదేవీ శిలా విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణలు, భాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. గురువారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం కాళికాదేవి శిలావిగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు చేశారు.

### నేడు కాళికాదేవీ విగ్రహ ప్రతిష్ఠాపన..

పట్టణంలో నూతనంగా నిర్మించిన కాళికాదేవి ఆలయంలో శుక్రవారం కాళికాదేవి, వినాయకుడు, నాగదేవతలు, పంచలోహ శ్రీచక్రం, కళశం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 4.50 గంటల నుంచి 5.20 గంటలకు ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రతిష్ఠాపనకు భక్తులు అశేష సంఖ్యలో తరలివచ్చి అమ్మకృపకు పాత్రులు కావాలని కోరారు.

## 2 లక్షల నగదు పట్టివేత.

మానవపాడు, నవంబర్ 23 : ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల నగదును పట్టుకుని సీజ్ చేసినట్టు ఎస్సై రాము తెలిపారు. గురువారం కొర్విపాడు స్టేజి వద్ద ఎస్సై రాము ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా తమిళనాడు రాష్ట్రం మధురైకి చెందిన మధుసూదన్ కర్నూలు పట్టణానికి వెళ్లడానికి నిలిచి ఉండగా అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలు లేని రూ.2 లక్షలు నగదు దొరికిందన్నారు. నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పజెప్పినట్టు తెలిపారు.

## మద్యం పట్టివేత.. కేసు నమోదు

ఉండవెల్లి, నవంబర్ 23 : అక్రమ మద్యాన్ని ఏపీకి తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకున్నది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు ఇలా.. కర్నూలు జిల్లా మునగాలపాడు గ్రామానికి చెందిన మద్దిలేటి గౌడ్ 33మద్యం సీసాలను ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అలంపూర్ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించగా మద్యం ఉన్నట్లు గుర్తించారు. మద్దిలేటిగౌడ్ తరలిస్తున్న మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఎర్రవెల్లిలో..

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 23 : అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై కేసు నమోదైన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై అశోక్‌బాబు కథనం మేరకు.. ఇటిక్యాల స్టేజీ వద్ద పోలీసు సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కాగా పెద్దదిన్నె గ్రామానికి చెందిన బాలేశ్వార్,జైనుద్దీన్ తమ ఐ10కారులో 17.5 లీటర్ల మద్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డారు. మద్యం విలువరూ.19వేలు ఉంటుందన్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బింగిదొడ్డిలో అఖండ భజన

అయిజ రూరల్, నవంబర్ 23 : కార్తీకమాసం పురస్కరించుకొని బింగిదొడ్డిలోని వెలిసిన శివాలయంలో గురువారం అఖండ భజనను గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉదయం వేదపండితులు స్వామివారికి అర్చన, హోమం, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భజన శుక్రవారం ఉదయం వరకు కొనసాగి మంగళహారతులతో ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హార్మోణిస్టు వెంకటేశ్, దొడ్డెన్న, ఉరుకుందు, కిష్టన్న, నర్సింహులు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక సప్తాహ ప్రవచనాలు

వడ్డేపల్లి, నవంబర్ 23 : మండలంలోని జిల్లెడదిన్నె గ్రామంలో హిందూధర్మ పరిషత్ నిర్వాహకులు నర్సింహులు గురువారం కార్తీక సప్తాహ ప్రవచనాలను భక్తులకు వివరించారు. భక్తి మార్గం ఉత్తమమైనదని మంచి ఆచారాలు ప్రతి హిందువు పాటించాలని తెలిపారు. అనంతరం రామాపురం భజన బృందం భక్తి గీతాలను ఆలయంలో ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, చక్రపాణి, శ్రీనివాసరెడ్డి, రాజు, దానేశ్వర్‌రెడ్డి, మద్దిలేటి, వెంకటేశ్, పురుషోత్తం, మధు పాల్గొన్నారు.

## పోలింగ్‌కు ఈవీఎం సిద్ధం చేయాలి



ఈవీఎంల కమిషనింగ్ పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

### కమిషనింగ్ పరిశీలించిన కలెక్టర్‌వల్లూరు క్రాంతి

అలంపూర్, నవంబర్ 23 : ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంల సీయూ, బీయూ, వీవీ ప్యాట్లకు కమీషనింగ్ చేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. గురువారం అలంపూర్ నియోజకవర్గం ఎన్నికలకు సంబంధించిన అలంపూరు చౌరస్తా వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన డిస్టిబ్యూషన్ కేంద్రాన్ని ఈవీఎం ఇంజినీర్లతో కలిసి సందర్శించి కమీషనింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవో, ఏపీవోలు, 31 సెక్టోరియల్ ప్రకారం 31 టేబుల్స్ ఏర్పాటు చేసి పంపిణీకి సిద్ధం చేసినట్లు తెలిపారు. అలంపూరు నియోజకవర్గంలో 290 పోలింగ్ కేంద్రాలున్నాయని వాటికి సంబంధించిన 362 కంట్రోల్ యూనిట్లు, 362 బ్యాలెట్ యూనిట్లు కమీషనింగ్ చేసినట్టు వివరించారు. ఇందుకుగానూ 400 మంది సిబ్బంది పాల్గొన్నారన్నారు. వీవీ ప్యాట్లను హారిజెంటల్ మోడ్‌లో ఉంచాలని సూచించారు. ఈవీఎంల పంపిణీ రోజుఎన్నికల సిబ్బందికి భోజనం, తాగునీరు సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మానవపాడు జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పోలింగ్ బూత్ సెంటర్ లు 216 నుంచి 220 వరకు తనిఖీ చేశారు. పోలింగ్‌కేంద్రంలో విద్యుత్‌సౌకర్యం, ర్యాంపులు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు వెబ్ కాస్టింగ్ నిర్వహించాలన్నారు. బీఎల్వోలు స్లిప్పులను వారి మొబైల్‌కు ఫోన్‌చేసి స్లిప్పులు అందజేయాలన్నారు. తిరు గు ప్రయాణంలో స్కూల్‌లో 34, 35 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అలంపూ రు ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, ఆర్డీవో చంద్రకళ, ఎస్‌డీసీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ వ్యక్తిమృతి

గద్వాల అర్బన్, నవంబర్ 23 : ప్రభుత్వ దవాఖానలో ఓ రోగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన గద్వాల ప్రభుత్వ దవాఖానలో చోటు చేసుకున్నది. పూర్తి వివరాలు ఇలా.. ధరూర్ మండలం పరిధిలోని అల్లపాడు గ్రామానికి చెందిన నర్సింహులు అనారోగ్యానికి గురువారం దవాఖానకు కుటుంబ సభ్యులు తరలించారు. ఉదయం నుంచి నర్సింహులు చికిత్స తీసుకుంటూ సాయంత్రం అకస్మికంగా మృతి చెందాడు. మృతికి వైద్యులు నిర్లక్ష్యంగా వ్యహరించడమే కారణమేనని కుటుంబ సభ్యులు ఆరోపణలు చేశారు.

